క్లుప్తంగా

బూత్ స్థాయి కమిటీ ఎన్నిక



ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని బట్లదిన్నెలో గురువారం బీజేపీ మండలాధ్యక్షుడు జగదీష్‌రెడ్డి ఆధ్వర్యంలో 38వ పోలింగ్ బూత్ స్థాయి కమిటీని ఎన్నుకున్నారు. ముఖ్య అతిథిగా అసెంబ్లీ కన్వీనర్ తిరుమల్‌రెడ్డి హాజరై మాట్లాడారు. బూత్ కమిటీ సభ్యులు గ్రామంలోని ఇంటింటికి తిరిగి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అదేవిధంగా రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారమే లక్ష్యంగా పనిచేయాలని కమిటీ సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో నాయకులు మాధన్న, బలరాంరెడ్డి, కేకేరెడ్డి, అశోక్, జనార్దన్‌రెడ్డి, వెంకటేష్, తిరుమల్‌రెడ్డి, రాము, ఈశ్వర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

మందా శ్రీనాథ్‌ను కలిసిన వెల్ఫేర్ సొసైటీ సభ్యులు



ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని కొండేరు గ్రామాన్ని గురువారం రాజ్ మొబైల్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు భాగ్యలక్ష్మి, శ్రావణ్‌కుమార్ లు సందర్శించారు. ఈ సందర్భంగా అలంపూర్ బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు మందా శ్రీనాథ్‌ను తన నివాసంలో కలిసి గ్రామంలో తమ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో చేపట్టబోయే పలు సేవా కార్యక్రమాలపై చర్చించారు. దీనిలో భాగంగా పరిసరాల పరిశుభ్రత, బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలు, సీజనల్ వ్యాధుల వల్ల కలిగే సమస్యలపై గ్రామంలోని ప్రజలకు అవగాహన కల్పించేందుకు గాను సహకరించాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు వారు పేర్కొన్నారు.

'ఖమ్మం సభతో ఒరిగిందేమీ లేదు'



ఎర్రవల్లిచౌరస్తా: బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఖమ్మం సభతో ప్రజలకు ఒరిగిందేమీ లేదని బీఎస్పీ నాయకుడు రాంబాబు అన్నారు. గురువారం ఇటిక్యాల మండలంలోని శివనంపల్లి, మొగిలిరావులచెర్వు, వేముల గ్రామాలను ఆయన సందర్శించి ఆయా గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే బీఆర్‌సభ సభ ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను బలోపేతం చేయండి

మదనాపురం: హాత్ సే హాత్ జోడో యాత్రను విజయవంతం చేయాలని మండలంలోని దంతనూర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ నాయకులకు సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన వనపర్తి డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్‌యాదవ్ మట్లాడుతూ.. గ్రామాల్లో పార్టీ బలోపేతంపై దృష్టి సారించాలని సూచించారు. సార్వత్రిక ఎన్నికలు ఎప్పుడు వచ్చిన కేంద్రం, రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో రామచంద్రయ్య, వేమన్న, సత్యశీలారెడ్డి, కృష్ణవర్ధన్‌రెడ్డి, అంజాద్ అలీ, రంజిత్‌కుమార్, వడ్డె కృష్ణ, ఆవుల రాఘవేంద్ర, శేఖర్‌రెడ్డి, మహేష్, వడ్డె బాలస్వామి, కావలి అశోక్ కుమార్, ఖాజామైనోద్దీన్ పాల్గొన్నారు.

అందరిచూపు బీఆర్ఎస్ వైపు

ఆత్మకూర్: దేశవ్యాప్తంగా అందరిచూపు బీఆర్ఎస్ వైపు ఉందని, ముఖ్యమంత్రి కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు దేశవ్యాప్తంగా అమలు కావాలని ప్రజలు ఎదురుచూస్తున్నారని మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం ఆత్మకూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపూర్‌లో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్‌యాదవ్, కౌన్సిలర్ చెన్నయ్య ఆధ్వర్యంలో ఆయా పార్టీలకు చెందిన పలువురు యువకులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఖమ్మం సభతో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కంగుతిన్నాయని, రాబోయే రోజుల్లో దేశవ్యాప్తంగా బీఆర్ఎస్ ప్రభంజనం సృష్టించనుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బంగారుశ్రీనివాసులు, జెడ్పీటీసీ శివరంజని, చైర్‌పర్సన్ గాయత్రి, వైస్ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి, విండో అధ్యక్షుడు కృష్ణమూర్తి, లక్ష్మీకాంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

అట్టహాసంగా కంటి వెలుగు ప్రారంభం

జిల్లా వ్యాప్తంగా కంటి వెలుగు కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. ఆయా మండల కేంద్రాలతో వివిధ గ్రామాలలో కంటి వెలుగు కేంద్రాలు ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలోని బస్తీ దవాఖానతో పాటు కేటీదొడ్డిలోని నందిన్నె, మల్దకల్‌లోని రైతువేదిక, ధరూరులోని బూరెడ్డిపల్లి ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి, కలెక్టర్ వల్లూరి క్రాంతి, ఇటిక్యాల మండల కేంద్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ సరిత కంటి వెలుగు ప్రారంభించారు. గట్టులోని రైతు వేదికలో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి, అలంపూర్ పట్టణంలోని హరిజనవాడ పాఠశాలలో ఎమ్మెల్యే వీఎం అబ్రహంలు ప్రారంభించి మాట్లాడారు. కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మానవపాడు మండలం గోకులపాడులో ఎంపీపీ అశోక్‌రెడ్డి, రాజోళి మండల కేంద్రంలో ఎంపీపీ రేణుకలు ప్రారంభించి వైద్యులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. వడ్డేపల్లి మండలంలోని తనగలలో జెడ్పీ డిప్యూటీ సీఈఓ ముషాయిదా బేగం, కేటీదొడ్డి మండలంలోని నందిన్నెలో ఎంపీపీ మనోరమ, జెడ్పీటీసీ రాజశేఖర్, ఉండవెల్లిలోని చిన్న ఆముదాలపాడులో ఎంపీపీ బీసమ్మ, అలంపూర్ మండలంలోని క్యాతూర్ రైతువేదికలో ఎంపీపీ బేగం, ప్రత్యేక అధికారి శ్రీధర్‌రెడ్డి, అయిజలోని బింగుదొడ్డిలో ఎంపీపీ నాగేశ్వర్‌రెడ్డి, అయిజ పట్టణంలోని రెడ్డి కమ్యూనిటీ హాల్‌లో మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్నలు రెండో విడత కంటి వెలుగును ప్రారంభించారు. శిబిరంలో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులతో పాటు కళ్ల అద్దాలు అందజేశారు. – సాక్షి, నెట్‌వర్క్



వడ్డేపల్లి మండలంలోని తనగలలో కంటి అద్దాలు అందజేస్తున్న జిల్లా పరిషత్ ఉప ముఖ్య కార్యనిర్వహణాధికారి ముషాహిదాబేగం



కేటీదొడ్డిలోని నందిన్నెలో కంటి వెలుగు ప్రారంభించిన ఎంపీపీ మనోరమ



ఉండవెల్లి చిన్న ఆముదాలపాడులో కంటి వెలుగును ప్రారంభిస్తున్న ఎంపీపీ



అలంపూర్ క్యాతూర్ రైతువేదికలో..



అయిజలోని బింగుదొడ్డిలో..



రాజోళిలో కంటి అద్దాలు అందజేస్తున్న ఎంపీపీ రేణుక



అయిజలో..

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి



ధరూరులో ఏర్పాటు చేసిన శిబిరంలో రక్తదానం చేస్తున్న దాతలు

ధరూరు: రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని డాక్టర్ వెనీమా తేజశ్రీ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని వైఎస్సార్ చౌరస్తాలోని రాజేశ్వరి ఫర్టిలైజర్స్, జియో లైఫ్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రభుత్వ బ్లడ్ బ్యాంక్ జోగులాంబ గద్వాల జిల్లా స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా 35వ సారి రక్తదానం చేసిన కుర్వ రామకృష్ణను అభినందించారు. పీఆర్ఓ రాకేష్, స్టాఫ్ నర్సులు రాధ, గంగభవానీ, టెక్నీషియన్లు రామకృష్ణ, ఫెరోజ్ రెహమాన్, కో ఆర్డినేటర్ చాంద్ పాషా, డ్రైవర్ మన్సూర్, రికార్డు అసిస్టెంట్ రమేష్, డీలర్ సీతారాములు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి శిక్షణ ప్రారంభం

కోయిల్‌కొండ: మండలంలో నిరుద్యోగ యువతీయువకులకు ఉపాధి అవకాశాల కోసం జనశిక్షణ సంస్థాన్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్వయం ఉపాధి శిక్షణ కేంద్రాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు విజయ్‌భాస్కర్‌రెడ్డి, ఎంపీపీ శశికళ అన్నారు. గురువారం మండల కేంద్రంలో జనశిక్షణ సంస్థాన్ కేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ కేంద్రంలో నిరుద్యోగులకు వివిధ వృత్తుల్లో శిక్షణ ఇచ్చి వారికి ఉపాధికి బంగారు బాట వేసేందుకు జనశిక్షణ సంస్థాన్ ముఖ్య ఉద్దేశమని వారు తెలిపారు.

మంత్రిని కలిసిన బీఆర్ఎస్ నాయకులు

అయిజ: వనపర్తి జిల్లా కేంద్రంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డిని గురువారం ఆయన కార్యాలయంలో అయిజ మండలంలోని బీఆర్ఎస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలంలోని ఉత్తనూరులో ఈ నెల 24 నుంచి 30 వరకు నిర్వహించనున్న ధన్వంతరి వేంకటేశ్వరస్వామి జాతర ఉత్సవాలకు హాజరుకావాలని ఆహ్వాన పత్రిక అందజేశారు. గౌతంరెడ్డి, ఖాజా, వెంకటేష్, మద్దిలేటి, వెంకట్రావు, వీరేష్ ఉన్నారు.



మంత్రి నిరంజన్‌రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కేంద్ర ప్రభుత్వ నిధులపై తప్పుడు ప్రచారం



కమిటీ సభ్యులతో తిరుమల్‌రెడ్డి

మానవపాడు: కేంద్ర ప్రభుత్వ నిధులపై బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని అలంపూర్ నియోజకవర్గ కన్వీనర్ మెడికల్ తిరుమల్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని బోరవెల్లిలో పోలింగ్ బూత్ స్థాయి కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామంలో బీజేపీ ప్రభుత్వ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను గ్రామాలలో వివరించాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతోనే రాష్ట్రంలో అభివృద్ధి పనులు చేశారన్నారన్నారు. కార్యక్రమంలో మాధన్న, బలరాంరెడ్డి, కేకేరెడ్డి, మురళీకృష్ణ, రమేష్, జగన్, జగదీష్ తదితరులు ఉన్నారు.

పీహెచ్‌సీకి ప్రింటర్ అందజేత

అమరచింత: పట్టణంలోని డీఎంఆర్ఎం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రింటర్ లేక సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకొని డీఎంఆర్ఎం ట్రస్టు ద్వారా కొత్త ప్రింటర్‌ను గురువారం ఆస్పత్రి సిబ్బందికి అందించారు. డీఎంఆర్ఎం ట్రస్టు చైర్మన్, మాజీ అడ్వకేట్ జనరల్ దేశాయి ప్రకాష్‌రెడ్డి ఆస్పత్రిని సందర్శించిన సమయంలో ఆస్పత్రిలో ప్రింటర్ లేక ఇబ్బందులు కలుగుతున్నాయని సిబ్బంది ఆయన దృష్టికి తెచ్చారు. స్పందించిన ప్రకాశ్‌రెడ్డి కొత్త ప్రింటర్‌ను ఆస్పత్రికి అందించారని రెడ్‌క్రాస్ జిల్లా కమిటీ సభ్యుడు శ్యామ్ తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ వసంత, ల్యాబ్ టెక్నీషియన్ రాజు, శివ, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

గట్టు: మండల కేంద్రానికి చెందిన బోయ రమేష్(25) అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ బాసు శ్యామల, సర్పంచుల సంఘం అధ్యక్షుడు బల్గెర హనుమంతు, కాంగ్రెస్ పార్టీ నాయకులు బల్గెర నారాయణరెడ్డి, మాచర్ల వెంకటస్వామిగౌడ్, గౌస్, మహబూబ్‌పాషలు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, సంతాపం ప్రకటించారు.

కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకొస్తాం



గట్టు: కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకొస్తామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పటేల్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని భవానీ కమ్యూనిటీ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకుల, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర ఈ నెల 26న ముగుస్తుందని ఈ సందర్భంగా హాత్ సే హాత్ జోడో(చేయి చేయి కలిపి) అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు చేయి చేయి కలిపి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. బల్గెర నారాయణరెడ్డి, వెంకటస్వామిగౌడ్, గౌస్, నల్లారెడ్డి, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో నియోజకవర్గం వెనుకబాటు



మాట్లాడుతున్న ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్

శాంతినగర్: బీఆర్ఎస్ పాలనలో అన్ని రంగాల్లో నియోజకవర్గం వెనుకబడిందని ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ అన్నారు. గురువారం వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటివరకు మల్లమ్మకుంట, జూలెకల్, వల్లూరు రిజర్వాయర్ల నిర్మాణ పనులు మొదలుపెట్టలేదని విమర్శించారు. అలంపూర్ నియోజకవర్గంలో ప్రజల సంక్షేమాన్ని ప్రజాప్రతినిధులు గాలికొదిలేశారన్నారు. ఇసుకదందా, కమీషన్లు, పర్సెంటేజీలు, గ్రూపు తగాదాలు, వర్గవిభేదాలపై మక్కువ చూపుతున్నారే తప్ప పాలకులు నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టిసారించడంలేదని ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకుల ఆగడాల నియంత్రణలో అధికారులు విఫలమయ్యారన్నారు. బీఆర్ఎస్ నాయకులు ఆగడాలను అరికట్టాలని లేనిపక్షంలో కలెక్టరేట్ ముట్టడిస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఆయా మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, రాము, గోపాల్, జయన్న, ఎర్రవల్లి రవి తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌ఫాం సాగుపై ఆసక్తి పెంచుకోవాలి



పంటల వివరాలు నమోదు చేస్తున్న ఏఈఓ మౌనిక

ఎర్రవల్లిచౌరస్తా: ఆయిల్‌ఫాం సాగుపై ఆసక్తి పెంచుకోవాలని వ్యవసాయ విస్తరణ అధికారి మౌనిక అన్నారు. గురువారం ఇటిక్యాల మండలంలోని తిమ్మాపురంలో రైతులు యాసంగిలో సాగు చేసిన వివిధ పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆన్‌లైన్‌లో పంటల వివరాలను నమోదు చేశారు. అనంతరం గ్రామంలో రైతులకు ఆయిల్ ఫాం పంటసాగు, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలపై అవగాహన కల్పించారు. అధికారుల వద్ద పంటలను నమోదు చేసుకోవాలని లేనిపక్షంలో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయదని తెలిపారు. కార్యక్రమంలో రైతులు, తదితరులు ఉన్నారు.

అక్రమంగా ఏర్పాటు చేసిన డబ్బాల తొలగింపు



అక్రమంగా ఏర్పాటు చేసిన డబ్బాలను తొలగిస్తున్న సిబ్బంది

అమరచింత: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో అక్రమంగా ఏర్పాటు చేసుకున్న డబ్బాలను మున్సిపల్ కార్మికులతో తొలగించామని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఖాజా తెలిపారు. పట్టణంలోని ప్రధాన రహదారులతో పాటు జాతీయ నాయకుల విగ్రహాల వద్ద అక్రమంగా డబ్బాలను ఏర్పాటు చేయడం ద్వారా ట్రాఫిక్ అంతరాయం కలగడంతో వాహనదారులకు ఇబ్బందులు కలుగుతున్నాయని కమిషనర్ తెలిపారు. ప్రజల ద్వారా వచ్చిన ఫిర్యాదులతో గురువారం ముందస్తుగా బస్టాండ్‌కు ఎదుట ఏర్పాటు చేసుకున్న డబ్బాలతో పాటు తడకల షెడ్లను తొలగించామన్నారు. మున్సిపల్ అధికారుల అనుమతి లేకుండా ఎవరైన ప్రభుత్వం స్థలాలను అక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పల్లె ప్రగతికి ప్రత్యేక యాప్

- గ్రామాల రోజువారీ పనులు నేరుగా అప్‌లోడ్
- నిత్యం పనులను పర్యవేక్షిస్తున్న ఉన్నతాధికారులు
- గ్రామాల్లో మెరుగుపడుతున్న పారిశుద్ధ్యం



కోదండాపురంలో పల్లె ప్రగతి పనులను పరిశీలిస్తున్న రాష్ట్ర ఉన్నతాధికారులు(ఫైల్)

ఎర్రవల్లిచౌరస్తా: పంచాయతీలకు ట్రాక్టర్లు, ట్రాలీలు, మల్టీపర్పస్ కూలీలు వచ్చిన తర్వాత పంచాయతీలలో కార్మికులు నిత్యం వీధుల్లో చెత్తను సేకరిస్తున్నారు. ఫలితంగా గ్రామాల్లో సైతం పారిశుద్ధ్యం రోజు రోజుకు మెరుగు పడింది. అలంపూర్ నియోజకవర్గంలోని 124 గ్రామ పంచాయతీలలో ఈ పనులను మరింతగా మెరుగు పరిచేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలను చేపట్టింది. దీనికోసం గ్రామాల్లో రోజువారీ పనులు ఎలా ఉన్నాయి. పల్లె ప్రగతి పనులు ఎలా కొనసాగుతున్నాయో తెలుసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం పల్లె ప్రగతి పేరిట ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. దీని ద్వారా నిత్యం గ్రామాల్లో చేపడుతున్న పనుల వివరాలను పంచాయతీ కార్యదర్శులు నేరుగా యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా కార్యదర్శులు రోజువారీగా చేపట్టాల్సిన పారిశుద్ధ్య నివేదికలను కూడా తయారు చేస్తారు. అదేవిధంగా వారు చేపట్టిన పనులకు సంబంధించిన మానటరింగ్ రిపోర్టు కూడా తయారు చేసి పంపిస్తారు. దీనిలో అప్‌లోడ్ చేసిన ఫొటోలను, గ్రామాల్లో జరుగుతున్న వాస్తవ పరిస్థితులను రాష్ట్రస్థాయిలో ఏర్పాటు చేసిన బృందం యాప్ ద్వారా ఎప్పటికప్పుడూ పరిశీలించి పనులపై కార్యదర్శులకు తగిన సూచనలను, సలహాలను అందిస్తున్నారు.

అభివృద్ధిలో అధికారుల భాగస్వామ్యం

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పల్లె ప్రగతి యాప్‌లో గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఆయ శాఖల అధికారులను భాగస్వామ్యం చేసింది. దీనిలో పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ అధికారి, డీఎల్‌పీఓ, బీఎల్‌పీఓలు కూడా భాగస్వాములై ఉన్నారు. గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలో ప్రతిరోజూ కార్యదర్శులు ఏ పని చేయాలో ఫోన్‌కు నేరుగా సంక్షిప్త సందేశం వస్తోంది. దీనిలో భాగంగా పారిశుద్ధ్య పనులపైనే గ్రామాల్లో అధికారులు ప్రత్యేకంగా దృష్టిసారిస్తున్నారు. ప్రభుత్వ పనిదినాలలో ఉదయం 7 నుంచి రాత్రి 7 గంటల వరకు ఈ యాప్ అందుబాటులో ఉంటుంది. ఇందులో నిత్యం జరిగిన పనుల వివరాలతో పాటు సంబంధిత ఫొటోలను తీసి కార్యదర్శులు అప్‌లోడ్ చేస్తారు. దీనిలో భాగంగా పల్లె ప్రగతి పనులు, వాటర్ ట్యాంకు శుభ్రత, పంచాయతీ పాలన, నివేదిక నిర్వహణ, ధ్రువపత్రాల ఆమోదం, జనన, మరణాల నమోదు, ఆదాయం, ఖర్చులు, చెక్కులు ఇవ్వడం, కార్మికుల వేతనాలు, విద్యుత్ బిల్లుల చెల్లింపులు, గ్రామసభల నిర్వహణ, ఉపాధి పనుల వివరాలను ఎప్పటికప్పుడూ కార్యదర్శులు ఈ యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు.

పరిశుభ్రత మెరుగు పడింది..



గ్రామంలో నిత్యం చేపడుతున్న పనుల సమాచారాన్ని, పారిశుద్ధ్యానికి సంబంధించిన పూర్తి వివరాలను రోజు వారీగా యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నాం. పనిచేయడానికి ముందు ఫొటో, పనిచేసిన తర్వాత పనుల ఫొటోలతో పాటు పూర్తి వివరాలను నేరుగా పంపిస్తున్నాం. దీంతో గ్రామాల్లో అభివృద్ధి, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టిని పెట్టడంతో పల్లెల పరిశుభ్రత మెరుగు పడింది.

– కౌసల్య, పంచాయతీ కార్యదర్శి, సాసనూలు

పారదర్శకత పెరిగింది



మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల పరిధిలో రోజూ వారీగా జరిగే పనుల వివరాలను కార్యదర్శులు ఎప్పటికప్పుడూ పల్లె ప్రగతి యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. దీంతో పల్లెల అభివృద్ధితో పాటు పారిశుద్ధ్య పనులలో ప్రస్తుతం పారదర్శకత పెరిగింది. అభివృద్ధి పనులు సక్రమంగా జరగకపోతే హైదరాబాద్ కమిషనరేట్ కార్యాలయం నుంచి సంబంధిత పంచాయతీ కార్యదర్శికి నేరుగా ఫోన్ కాల్ వస్తుంది.

– భాస్కర్, మండల పంచాయతీ అధికారి, ఇటిక్యాల

లింగారెడ్డి సేవలు మరువలేనివి



ఈర్లదిన్నెలో లింగారెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

అమరచింత: నిరంతరం ప్రభుత్వంతో పోరాడి జూరాల ముంపు గ్రామల ప్రజలకు పరిహారం ఇప్పించడంలో స్వర్గీయ చుక్క లింగారెడ్డి సేవలు చిరస్మరణీయమని మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఈర్లదిన్నెలో గురువారం చుక్క లింగారెడ్డి విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో రూ.1.20కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం చుక్క లింగారెడ్డి స్మారకార్థం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మంచి మనస్సుతో పాటు క్రమశిక్షణ కలిగిన ప్రజానాయకుడిగా ఈప్రాంత ప్రజల హృదయంలో లింగారెడ్డి నేటికీ పదిలంగా ఉన్నారన్నారు. బడి, గుడితో పాటు అన్ని సౌకర్యాలను ప్రభుత్వం కల్పించే వరకు ప్రజల వెంటనే ఉంటూ పోరాడిన నాయకుడిగా ఇక్కడి ప్రజల మనస్సులను గెలిచారన్నారు. అనంతరం చుక్కవారి, మోరెడ్డి వారి వంశ వృక్షం పుస్తకాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. లింగారెడ్డి విగ్రహ ఆవిష్కరణకు హాజరైన మహిళలకు చుక్క ఆశిరెడ్డి, లక్ష్మమ్మ దంపతులు చీరలను పంపిణీ చేశారు.

